
సాక్షి
పల్నాడు
సోమవారం ౹ 28 ౹ అక్టోబర్ ౹ 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 5009, బ్యాంక్ కెనాల్‌కు 1356 క్యూసెక్కులు వదిలారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 45,312 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 44,222 క్యూసెక్కులు వదులుతున్నారు.

బగళాముఖి ఆలయంలో పూజలు




చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని అభయ ప్రదాయినిగా అలంకరణ చేశారు. భక్తులు పూలు, పండ్లు, పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు చేశారు.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

క్రోసూరు: క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో మేళా ఉంటుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ. తమ్మాజిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గ పరిసర ప్రాంత నిరుద్యోగులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇ.రామ కృష్ణారెడ్డిని 80743 93466, పి.శ్రీకాంత్‌ను 94921 58153 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సాగర్ వద్ద కొనసాగుతున్న నీటి విడుదల



విజయపురి సౌత్: నాగార్జునసాగర్‌లో ఆదివారం రెండు రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. 2 గేట్ల ద్వారా 16,138 క్యూసెక్కులు దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 64,472 క్యూసెక్కులు వస్తుండగా.. అంతే నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువ ద్వారా 9,967, ఎడమ కాలువ ద్వారా 6,173, ప్రధాన విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 29,394, ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 400 క్యూసెక్కులను వదులుతున్నారు. సాగర్ జలాశయ నీటిమట్టం గరిష్ట స్థాయిలో 590.00 అడుగుల వద్ద ఉంది. ఇది 312.0450 టీఎంసీలకు సమానం.

మిర్చియార్డు కార్యదర్శిగా ఆంజనేయులు బాధ్యతల స్వీకారం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్‌యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శిగా వినుకొండ ఆంజనేయులు ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు యార్డు కార్యదర్శిగా పనిచేసిన ఐ.వెంకటేశ్వరరెడ్డిని మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. రాజమండ్రి మార్కెట్ యార్డు కార్యదర్శిగా పనిచేస్తున్న ఆంజనేయులును గుంటూరుకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ యార్డును అన్ని విధాలుగా ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

శిశు విక్రయాలపై కేసు

నరసరావుపేటటౌన్: శిశు విక్రయాలపై ఎట్టకేలకు టూటౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇచ్చిన ఫిర్యాదుతో ఇది నమోదైంది. నరసరావుపేట కేంద్రంగా శిశు విక్రయాల రాకెట్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు శిశు సంక్షేమ, పోలీస్ శాఖల అధికారులు గోప్యంగా విచారణ చేపట్టారు. వెలుగు చూసిన విక్రయాలపై సాక్షి వరుస కథనాలతో పోలీస్, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. నిమ్మతోటకు చెందిన జూజం పద్మ... మధ్యవర్తి అయిన మరియమ్మ ద్వారా రూ.35 వేలకు పాపను కొనుగోలు చేసింది. పొంగులేటి నాగలక్ష్మికి ఒక మగ, ముగ్గురు ఆడ సంతానం ఉన్నారు. రెండో ఆడపిల్లను మధ్యవర్తి ద్వారా రూ. లక్షకు విక్రయించింది. పద్మ విక్రయించిన ఐదు నెలల పాపను అధికారులు గుర్తించారు. సంరక్షణ నిమిత్తం శిశు గృహకు తరలించారు. నాగలక్ష్మి విక్రయించిన చిన్నారి విజయవాడలోని ఓ ప్రైవేటు వసతి గృహంలో ఉన్నట్లు విచారణలో వెల్లడైందని జిల్లా బాలల పరిరక్షణ అధికారి దాసరి శౌరిరాజు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హైమారావు తెలిపారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షలు ప్రారంభం



ఏఎన్‌యూ : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పీజీ, డిగ్రీ కోర్సుల పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయని దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాలలో ఉదయం, మధ్యాహ్నం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పరీక్ష కేంద్రాలకు పరిశీలకులను, ప్రత్యేక స్క్వాడ్ బృందాలు, రీజినల్ కోఆర్డినేటర్లను నియమించామని వెల్లడించారు. వారి ద్వారా పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. వర్సిటీ దూరవిద్య కేంద్రంలో ప్రత్యేక విద్యార్థి సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల ఇబ్బందుల్ని తీరుస్తున్నట్లు తెలిపారు.

నాగార్జునకు ప్రాభవమేదీ?

ఇక్ష్వాకుల కాలంలో ప్రసిద్ధి చెందిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం శిథిలాలు ఇంకా పదిలంగా ఉన్నాయి. క్రీస్తు శకం 4వ శతాబ్దం కంటే ముందు నాటి వైభవాన్ని ఇవి చాటి చెబుతున్నాయి. నాగార్జునసాగర్‌లోని విజయపురి సౌత్‌కు 8 కిలో మీటర్ల దూరంలో ఈ విశ్వవిద్యాలయం ఉంది. రోజూ సాగర్‌కు వందల మంది సందర్శకులు వస్తున్నారు. కానీ చాలామందికి ఈ ఆనవాళ్ల గురించి తెలియదు. కనీసం లాంచీస్టేషన్ సమీపంలో దీని గురించి వివరాలు తెలిపే బోర్డులు కూడా లేకపోవడం విచారకరం.

- పర్యాటకుల సందర్శనకు నోచుకోని నాటి వర్సిటీ శిథిలాలు
- ఏర్పాట్లు చేయాలని అధికారులకు యాత్రికుల వినతి



అనుపులోని నాగార్జున విశ్వవిద్యాలయం నమూనా

విజయపురి సౌత్: సాగర్ నుంచి బెల్లంకొండవారి పాలెం మీదుగా మాచర్ల వైపు రహదారికి కిలోమీటరు దూరం లోపల నాగార్జున విశ్వవిద్యాలయం శిథిలాలు ఉన్నాయి. ఇదే శ్రీ పర్వత విహారంగా ప్రసిద్ధి పొందింది. ఈ విద్యాపీఠంలో ఆనాడు వివిధ దేశాల విద్యార్థులు చదువుకున్నారు. మహాయాన బౌద్ధ మత ప్రచారానికి ఇదే ప్రధాన భూమిక నిర్వహించింది. కృష్ణానది లోయలో కేంద్ర పురావస్తు శాఖ 3,700 చదరపు హెక్టార్లలో జరిపిన తవ్వకాలలో ఈ విశ్వవిద్యాలయం శిథిలాలు బయటపడ్డాయి. తరువాత కాలంలో పాత అనుపు వద్ద పునర్నిర్మించారు. ఇక్కడ ఆనాటి నాగార్జున విశ్వవిద్యాలయం, ఇక్ష్వాకుల కాలం నాటి యాంపీ స్టేడియం ఆనవాళ్లు ఉన్నాయి. కృష్ణానది లోయలో లభించిన రంగనాథస్వామి దేవాలయాన్ని అదే రాతితో అనుపులోని కృష్ణానది తీరంలో నిర్మించటం విశేషం. 1976కు ముందు ఈ పాత అనుపు నుంచే లాంచీలు నాగార్జున కొండకు వచ్చిపోయేవి. పర్యాటకులు సందర్శించటానికి సౌకర్యంగా ఉండేది. ఆ తరువాత విజయపురి సౌత్ (రైట్ బ్యాంక్)కి లాంచీస్టేషన్ మార్చటంతో పాత అనుపు వద్దకు పర్యాటకులు వెళ్లాల్సిన అవసరం రాలేదు. దీంతో ఆ ప్రదేశం నిరాదరణకు గురైంది. దీనిని సందర్శించాలనే ఆపేక్ష ఉన్నా తగిన ప్రయాణ సౌకర్యం లేదు.

యూనివర్సిటీ ప్రస్థానం ఇదీ..

ఆచార్య నాగార్జునుడు ఇక్కడ కృష్ణానది లోయలో విశ్వవిద్యాలయాన్ని నిర్మించారు. చారిత్రక ఆధారాలను బట్టి ఈ విహారం ఐదు అంతస్తులు కలిగి ఉన్నట్టు తెలుస్తోంది. దీనిని పర్వత విహారమని కూడా పిలిచేవారు. ప్రతి అంతస్తులోనూ బుద్ధుని స్వర్ణ ప్రతిమ ఉండేది. ఈ శిథిలాలు అప్పటి శిల్పకళకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. క్రీస్తు శకం 4వ శతాబ్దంలో ఆలయం ఉండేది. బౌద్ధ మతానికి చెందిన అనేక గ్రంథాలు రెండవ అంతస్తులో ఉండేవి. వివిధ దేశాల విద్యార్థులు ఇక్కడ చదివేవారు. రసాయన, వృక్ష, ఖనిజ, వైద్య శాస్త్రాలను బోధించేవారు. ఇక్కడే ఆచార్య నాగార్జునుడు అపరామృతం కనుగొన్నట్లు ఆధారాలున్నాయి. పాహియాన్, 7వ శతాబ్దంలో హ్యూయాన్‌స్యాంగ్, ఇత్సింగ్‌లు ఈ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి కొంత కాలం గడిపి మహాయాన బౌద్ధమతం గురించి అధ్యయనం చేశారని చరిత్ర చెబుతోంది. అక్కడక్కడా ఉన్న పాలరాతి శిల్పాలు ఈ విషయాన్ని తెలుపుతున్నాయి. నాగార్జునుడి మరణానంతరం కూడా ఈ విశ్వవిద్యాలయం కొన్ని శతాబ్దాలపాటు మనుగడలో ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి. ఇంత ప్రసిద్ధి చెందిన విశ్వ విద్యాలయం ఆనవాళ్లను సందర్శించేందుకు రవాణా సౌకర్యం లేకపోవటం విచారకరం. కనీసం శని, ఆదివారాల్లోనైనా పర్యాటక శాఖ మినీ బస్సులను ఏర్పాటు చేస్తే అనుపును సందర్శించేందుకు వీలవుతుందని యాత్రికులు కోరుతున్నారు.



వర్సిటీలో నాటి విద్యార్థులు బస చేసిన కాంప్లెక్స్



అనుపులోని యాంపీ స్టేడియం

టీడీపీలో 'సంత' పోరు?

- పశువుల సంత మూత వ్యవహారంపై రేగిన వివాదం
- తమిళనాడు వ్యాపారుల ఫిర్యాదుతో మూసివేసినట్లు వెల్లడి
- అసలు కారణం మాత్రం వేరని స్థానికుల వ్యాఖ్యలు



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎక్స్‌లో చేసిన పోస్టు

చిలకలూరిపేట: అధికార పార్టీలో వర్గపోరు పశువుల సంత మూసివేతకు దారితీసిందా అంటే... అందుకు ఇటీవల నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎక్స్‌లో చేసిన పోస్టు ద్వారా అవుననే సమాధానం వస్తోంది. ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లఘించి పశువుల సంత నిర్వహిస్తున్నారనే విషయం అధికార యంత్రాంగానికి గుర్తుకు వచ్చి పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహిస్తున్న పశువుల సంతను శుక్రవారం రాత్రికి రాత్రే మూయించేశారు. దీంతో శనివారం జరగాల్సిన సంత నిలిచిపోయింది. నిబంధనల మాట అలా ఉంచితే ఈ సంత దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇక్కడి నుంచి పశువులు కబేళాకు కూడా వెళ్తుంటాయి. తమిళనాడు, కేరళ, ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్తుంటారు. పశువులను తరలించేటప్పుడు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిర్దేశించిన ప్రమాణాలు పాటించాలి. సంత నిర్వహణ కోసం ఎన్ని జంతువులు రవాణా చేశారు.. వంటి వివరాలను మానిటరింగ్ కమిటీ పర్యవేక్షించాలి. ఇలాంటి నిబంధనలు ఏవీ అమలు కావన్న విషయం అధికార యంత్రాంగానికి ఇప్పటివరకు తెలియనిది కాదు. ఈ సంత నిర్వహణ వెనుక రాజకీయ నాయకుల హస్తం ఉంటుందనే విషయం అందరికీ విదితమే. అందుకే పశు సంవర్ధక, పోలీసు, రవాణా శాఖల యంత్రాంగం కూడా వారికి కావాల్సింది వారు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎక్కడి వరకు దారితీస్తుందో...

ఈ సంత నిర్వాహకుడు మల్లెల రాజేష్‌నాయుడు 2014–19 కాలంలో నాటి టీడీపీ ప్రభుత్వంలోని ఓ మంత్రికి ప్రధాన అనుచరుడిగా ఉన్నారు. రాష్ట్రంలో పశువుల సంతల నిర్వహణ నుంచి, రవాణా వరకు పట్టు సాధించారు. ఆ తర్వాత ఆనాటి మంత్రితో విభేదించారు. తిరిగి 2024 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరి క్రియాశీలకంగా వ్యవహరించారు. అంతా సజావుగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో ఎంపీ పోస్టు చేయడం, ఆ తదుపరి పరిణామాల్లో సంత మూతపడటం చర్చనీయాంశంగా మారింది. ఇది ఇలా ఉంటే తమిళనాడుకు చెందిన పశువుల వ్యాపారుల ఒత్తిడిపై సంత మూతపడిదంటూ జరుగుతున్న ప్రచారం ఏ మాత్రం నమ్మదగినట్లు లేదు. దీనికి కారణం సంత నిర్వాహకుడు స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యేకు అనుచరుడు కావడమే. ఆయన గతంలో టీడీపీలో పలు క్రియాశీలక పదవులు నిర్వర్తించడంతోపాటు 2024 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా ఉన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కడో తమిళనాడుకు చెందిన వారి ఫిర్యాదుతో చిలకలూరిపేట పశువుల సంత మూసివేశారనేది నమ్మశక్యంగా లేదని స్థానికులు పేర్కొంటున్నారు. తాము అంటే గిట్టని ఓ సామాజిక వర్గీయులు అధికార పార్టీకి చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి ద్వారా జిల్లా అధికారులపై ఒత్తిడి తెచ్చి పశువుల సంతను మూసివేయించారని మల్లెల రాజేష్ నాయుడు వర్గీయులు తెలిసిన వారి వద్ద వాపోతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం అధికార పార్టీలో ఆధిపత్య పోరును ఎక్కడి వరకు తీసుకెళ్తుందనేది ఆసక్తికరంగా మారింది.

కోలుకుంటున్న డయేరియా బాధితులు



డాక్టర్లతో మాట్లాడుతున్న నగర పంచాయతీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఇంటి వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది
- కాలనీలో పరిస్థితిని పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నేతలు

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో డయేరియా బాధితులు ఒక్కొక్కరు క్రమంగా కోలుకుంటున్నారు. ఇక్కడ వైద్య శిబిరాలు ఆదివారం కూడా కొనసాగాయి. కాలనీలో డయేరియా ప్రబలి ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా... మరో 20 మంది వరకు హాస్పిటల్స్‌లో చేరి చికిత్సలు పొందారు. స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది కాలనీలో వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు ఇమ్మడిశెట్టి అమూల్య, మధు, సుల్తానా తదితరులు సేవలను అందిస్తున్నారు. హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిన బాధితులతో మాట్లాడి పలు సూచనలు ఇస్తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగటంతో పాటుగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కొత్తగా డయేరియా లక్షణాలు ఉన్న కేసులు నమోదు కాలేదని డాక్టర్ మధు తెలిపారు.



ఓ మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

ఆరా తీసిన వైఎస్సార్‌సీపీ నేతలు

కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, నగర పంచాయతీ ప్రజాప్రతినిధులు ఆదివారం పర్యటించారు. వైద్య శిబిరం వద్దకు వెళ్లి అందిస్తున్న సేవలపై డాక్టర్ల బృందంతో మాట్లాడారు. బాధితులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లుగా వారు వివరించారు. అనంతరం కాలనీలో విస్తృతంగా పర్యటించి, ప్రజలతో మాట్లాడారు. ప్రజలకు అందుతున్న తాగునీటిని పరిశీలించారు. బాధితులకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డితోపాటుగా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కందుల జాను, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్ బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, వార్డు కౌన్సిలర్లు దేవళ్ల లక్ష్మీప్రసన్న, మురుగుడు రఘు, నగుబండి గురువులు, వందనపు వెంకట్రామయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బత్తుల బాలయ్య, నాయకులు వేముల తిరుపతయ్య, లింగయ్య, గరిణే పుల్లారావు, దుర్గారావు తదితరులున్నారు.

కలుషితమైన బోరు నీరు

– ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారించిన అధికారులు

దాచేపల్లి: అంజనాపురం కాలనీలో ప్రజలకు తాగునీరు సరఫరా చేసే బోరులోని నీరు కలుషితమైనట్లు ల్యాబ్ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు స్థానిక అధికారులకు ల్యాబ్ రిపోర్ట్‌లను పంపించారు. ఈ కాలనీలో మూడు చోట్ల బోర్ల నుంచి శాంపిల్స్ సేకరించి విజయవాడ ల్యాబ్‌కి పంపించారు. కాలనీవాసులకు తాగునీరు అందించే బోరు నీటిలో 45 శాతం ఉండాల్సిన నైట్రేట్ 52 శాతం ఉన్నట్లుగా గుర్తించారు. సమీపంలో మురికి నీరు పారటంతోపాటుగా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు కూడా ఉన్నాయి. దీంతో బోరులో నీరు కలుషితం అయింది. ప్రస్తుతం బోరుని అధికారులు సీజ్ చేసి, ట్యాంకర్ల ద్వారా క్లోరినేటెడ్ తాగునీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు.



సీజ్ చేసిన బోరు

రంజీ క్రికెట్ కింగ్ రషీద్

- జాతీయ క్రికెట్‌లో అదరగొడుతున్న గుంటూరు యువ కెరటం
- 20 ఏళ్ల తర్వాత జిల్లాకు కెప్టెన్సీ అవకాశం
- పేదరికాన్ని జయించి, విజయాల వైపు రషీద్ చూపు



అండర్-19 భారత జట్టు విజయం సాధించిన ట్రోఫీతో జైషా, వీవీఎస్ లక్ష్మణతో రషీద్

గుంటూరు వెస్ట్: విజయాలకు అడ్డదారులుండవు. కఠోర సాధనతోపాటు క్రమశిక్షణ ఎంతటి వారినైనా విజయతీరాల వైపు నడిపిస్తాయని గుంటూరుకు చెందిన షేక్ రషీద్ నిరూపిస్తున్నాడు. ఇంతై వటుడింతై అన్నట్లు అండర్-14 చిన్నారుల క్రికెట్ నుంచి విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలాంటి వారితో క్రికెట్ ఆడే అవకాశాల్ని దక్కించుకున్నాడు. ఇప్పుడు ఆంధ్ర రంజీ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కేవలం 21 సంవత్సరాల వయస్సులోనే ఈ బాధ్యతలు చేపట్టే అవకాశం దక్కడం మరో విశేషం. దాదాపు 20 ఏళ్ల తర్వాత గుంటూరు జిల్లాకు రంజీ సారథ్యం లభించడం విశేషం. ఎంఎస్‌కే ప్రసాద్ తర్వాత రషీదే కావడం గమనార్హం. గల్లీ క్రికెట్ నుంచి ఢిల్లీ క్రికెట్ వరకు లభించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు ఆడే ప్రతి జట్టుకు నమ్మదగిన బ్యాటర్‌గా చక్కని సేవలందిస్తున్నాడు. రెండేళ్ల నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అతి సాధారణ కుటుంబంలో పుట్టిన ఈ యువకుడు స్థానిక ఎన్జీఓ కాలనీలో కుటుంబంతో జీవిస్తున్నాడు.

జీవితాన్ని మార్చేసిన అండర్-19 భారత జట్టు స్థానం

2021లో అండర్-19 భారత జట్టులో స్థానం సంపాదించడంతోపాటు వైస్ కెప్టెన్ బాధ్యతలు చేపట్టాడు. 2022లో భారత జట్టు ప్రపంచ కప్ సాధించడంలో కీలక భూమిక పోషించాడు. దీంతోపాటు చాలెంజర్స్ ట్రోఫీకి ఎంపికవ్వడమే కాకుండా ఇండియా -డి జట్టుకు సారథ్యం వహించి తన జట్టును చాంపియన్‌గా నిలబెట్టాడు. ఈ ట్రోఫీలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌తోపాటు 274 పరుగులు సాధించాడు. 2022లో కోల్‌కొత్తాలో జరిగిన ట్రయాంగిల్ సిరీస్, ఏషియన్ పోటీల్లోను చక్కగా రాణించాడు. ఈ ఏడాది దులీప్ ట్రోఫీలో మ్యాచ్‌లు ఆడుతున్నాడు.



చాలెంజర్స్ ట్రోఫీలో సెంచరీ చేసిన అనంతరం రషీద్ దరహాసం

కోహ్లి ఆటంటే ఎంతో ఇష్టం

రషీద్ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్. మైదానంలో సొగసైన డ్రైవ్స్‌తో అందరినీ ఆకట్టుకుంటాడు. తడబాటుకు తావులేకుండా ఆడడమే తన విజయ రహస్యమంటాడు. ప్రతి మ్యాచ్‌లోనూ ఔటైన విధానాన్ని నెట్ ప్రాక్టీస్‌లో సరి చేసుకుంటాడు. దీని కోసం బౌలర్లకు కఠిన పరీక్షలు పెడతాడని సహచర క్రికెటర్లు సరదాగా అంటుంటారు. ముఖ్యంగా రషీద్‌కు విరాట్ కోహ్లి ఆరాధ్య క్రికెటర్. కోహ్లి ఆడే విధానం, అతడి దృఢ చిత్తం గొప్పవరమని రషీద్ అంటాడు. కోహ్లి ఆటతోపాటు ఫిట్‌నెస్‌పై తీసుకునే జాగ్రత్తలు ప్రతి క్రికెటర్‌కు మార్గదర్శకాలని కితాబునిస్తాడు.

భారత జట్టులో స్థానమే లక్ష్యం

ఏ క్రికెటరైనా భారత జట్టులో స్థానం కోసం కలలు కంటాడు. నేను కూడా అంతే. మన దేశం తరఫున ఆడడంతోపాటు చిరస్మరణీయమైన విజయాల్లో భాగస్వామిగా నిలవాలి. దాని కోసం ఎంత కష్టాన్నైనా అధిగమిస్తా. ఆంధ్ర జట్టు రంజీ కెప్టెన్‌గా ఎంపిక చేసిన ఏసీఏ పెద్దలు, నన్ను ప్రోత్సహించిన గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులతోపాటు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. రంజీ జట్టులో నా కంటే సీనియర్ క్రికెటర్లున్నారు. వారందరిని కలుపుకొని పెద్దల సూచనలతో విజయాలు సాధించేందుకు కృషి చేస్తా. చాలెంజర్స్ ట్రోఫీ డీ జట్టుకు కెప్టెన్‌గా చేసి ఆ జట్టును చాంపియన్‌గా నిలిపిన అనుభవం నాకు ఉపయోగపడుతుంది.

–షేక్ రషీద్, ఆంధ్ర రంజీ జట్టు కెప్టెన్

రషీద్ అన్ని విధాలా అర్హుడు



నేను గతంలో చాలా కాలం ఆంధ్ర జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహించాను. అప్పటి కంటే కూడా ఇప్పుడు క్రికెటర్లకు అవకాశాలు బాగా పెరిగాయి. ముఖ్యంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఎంతో బలపడింది. యువ క్రికెటర్లకు ఎన్నో చక్కటి వసతులు ఏర్పాటు చేస్తోంది. రషీద్ అండర్-19 భారత జట్టు వైస్ కెప్టెన్‌గా చేసిన అనుభవం ఉంది. మైదానంలో పోరాడే తత్వం చాలా ఎక్కువ. నా తర్వాత గుంటూరు జిల్లా నుంచి ఇంత కాలానికి రషీద్ ఎంపిక కావడం చాలా సంతోషం. రషీద్ క్రికెటర్‌గా ఎదిగిన తీరు యువ క్రికెటర్లకు ఆదర్శం. ఆయన సారథ్యంలో మంచి విజయాలు నమోదు కావాలని ఆశిస్తున్నాను. రషీద్‌కు ఆల్ ద బెస్ట్.

–ఎంఎస్‌కే ప్రసాద్, బీసీసీఐ మాజీ చైర్మన్

రాష్ట్ర స్కూల్ గేమ్స్ టెన్నిస్ పోటీలకు చిన్నారుల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): కాకినాడలో సోమవారం నుంచి బుధవారం వరకు జరగనున్న రాష్ట్ర స్కూల్ గేమ్స్ టెన్నిస్ పోటీలకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియం చిన్నారులు కె.విన్సెంట్, వై.తేజిత్, నరేష్ కుమార్ రెడ్డి, వి.లలిత్, ఎస్‌కే అబ్రాల్, జి.దిశాంత్, షాన్ ఎంపికయ్యారని కోచ్ జీవీఎస్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా వీరు ఎంపికయ్యారని పేర్కొన్నారు.



క్లుప్తంగా

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

నరసరావుపేటటౌన్: ఇంటి నుంచి అలిగి వెళ్లిన బాలికను వెతికి తల్లిదండ్రులకు అప్పగించినట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ ఆదివారం తెలిపారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన 14 ఏళ్ల బాలిక శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆమె ఆచూకీ కోసం సీఐ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వంశీకృష్ణ బృందంగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఆమె ఆచూకీ కనుగొని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

టెయిల్‌పాండ్‌కు 45 వేల క్యూసెక్కులు వరద

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్ల ద్వారా 45,302 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ జయపాల్ ఆదివారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 3 క్రస్ట్‌గేట్లు 2 మీటర్లు, ఒక క్రస్ట్‌గేటు 1.5 మీటర్లు ఎత్తి 36,918 క్యూసెక్కులు, విద్యుత్ ప్రాజెక్టులో నున్న రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి అనంతరం 8,384 క్యూసెక్కులు మొత్తం 45,302 క్యూసెక్కుల వరదనీటిని దిగువనున్న కృష్ణానదికి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 75.50 మీటర్లకుగాను 75.50 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 7.080 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 55.94 మీటర్లకు చేరుకుందన్నారు. నాగార్జునసాగర్ నుంచి 45,370 క్యూసెక్కుల వరదనీరు టెయిల్‌పాండ్ రిజర్వాయర్‌కు వస్తుందన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

బొల్లాపల్లి: మండలంలోని ఘటితండా ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు సీహెచ్ గోపిరాజు సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు ఇచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారి -1 సయ్యద్ జప్రుల్లా తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కేసు నమోదు కావడంతో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. దసరా సెలవుల నుంచి ఉపాధ్యాయుడు సెలవులో ఉన్నట్లు చెప్పారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

అద్దంకి రూరల్: బైకు అదుపుతప్పి కిందపడి తలకు తీవ్ర గాయం కావడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బొప్పూడి సమీపంలో ఆదివారం జరిగింది. అద్దంకిలోని సాయిబాబా దేవస్థాన సమీపంలో నివాసం ఉంటున్న గోనుగుంట నాగేశ్వరరావు(52) తాపీ మేస్త్రీ పనులు చేస్తుంటాడు. రెండు రోజుల కిందట విజయవాడలో ఉంటున్న కుమారుడి వద్దకు బైకు మీద వెళ్లాడు. ఆదివారం అద్దంకికి వస్తుండగా మార్గంమధ్యలో పల్నాడు జిల్లా చిలకలూరిపేట దాటిన తర్వాత బొప్పూడి సమీపంలోకి రాగానే మట్టికుప్ప ఎక్కించే క్రమంలో బైకు అదుపుతప్పి కింద పడింది. దీంతో తలకు తీవ్ర గాయమై నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఫోన్ చేసి అద్దంకిలోని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.వారు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని అద్దంకి తీసుకువచ్చారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రాజశేఖర్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే శాస్త్రీయ పరమైన ఆలోచనలకు పునాది వేయడం ద్వారా భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దవచ్చునని తెలిపారు. ప్రతి విద్యార్థి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు తమ మేధస్సుతో పరిష్కారాన్ని చూపించాలని, ఆ దిశగా వారిని ప్రోత్సహించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. కళాశాల సలహాదారు డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలకు నాలుగు లక్షల మందికి పైగా విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఏపీఆర్ఎస్ (తాడికొండ), జలగం రామారావు జీఎంసీ హైస్కూల్ (గుంటూరు), జెడ్పీ హైస్కూల్ (తాడేపల్లి), ప్రైవేటు పాఠశాలల విభాగంలో కొండవీడు పబ్లిక్ స్కూల్, విజేత పబ్లిక్ స్కూల్, శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ వరుసగా తొలి మూడుస్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో హిందూ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, జేవీవీ నాయకులు కె. శ్రీనివాస్, టి.జాన్‌బాబు, ఎస్ఎం సుభాని, డాక్టర్ ఏ.ఎస్. ప్రసాద్, బి.ప్రసాద్, జి.వెంకటరావు, టీఆర్ రమేష్, బి.శంకర్‌సింగ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కళాధర్, కె.సాయి పాల్గొన్నారు.

ఉత్కంఠ రేపుతున్న ఏసీఏ మ్యాచ్

- తొలి ఇన్నింగ్స్‌లో గ్రూప్–సీ 145 పరుగుల ఆధిక్యత
- రెండవ ఇన్నింగ్స్‌లో ధీటుగా బదులిస్తున్న గ్రూప్–ఏ జట్టు


ఎస్.రాజేష్, 5వికెట్లు, గ్రూప్–ఏ జట్టు


జయంత్‌కృష్ణ, 66 పరుగులు, గ్రూప్–సీ..

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న గ్రూప్–ఏ, గ్రూప్–సీ జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. తొలిఇన్నింగ్‌లో 145 పరుగులు వెనుకబడ్డ గ్రూప్–ఏ జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో కుదురుగా బ్యాటింగ్ చేస్తున్నది. శనివారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ మూడు వికెట్లు నష్టానికి 88 పరుగులతో ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన గ్రూప్–సీ జట్టు 361 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఏ.జయంత్‌కృష్ణ 66, జి.మన్విత్‌రెడ్డి 52, ఎంవిఎస్ రక్షణ్ 50 పరుగులతో రాణించారు. మరోవైపు గ్రూప్–ఏ బౌలర్ 5 వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం రెండో ఇన్నింగ్ బ్యాటింగ్ ప్రారంభించిన గ్రూప్–ఏ జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 115 పరుగులు సాధించి ఇంకా 30 పరుగులు వెనుకబడి ఉంది. జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 38 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. సోమవారం మూడవరోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

ప్రతి నలుగురిలో ఒకరికి పక్షవాతం ముప్పు

సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ


మాట్లాడుతున్న డాక్టర్ విజయ, వేదికపై తారక్‌నాథ్, డాక్టర్ అరుణకుమారి

గుంటూరు మెడికల్: ప్రపంచ జనాభాలో ప్రతి నలుగురిలో ఒకరికి పక్షవాతం వస్తోందని సీనియర్ న్యూరాలజిస్ట్, ఏపీ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. ఆదివారం గుంటూరు నగరంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ ప్రజలు పక్షవాతం బారిన పడకుండా ముందస్తుగా అవగాహన కల్పించేందుకు అక్టోబర్ 29న వరల్డ్ స్ట్రోక్ డే నిర్వహిస్తున్నారని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలతో పక్షవాతాన్ని రాకుండా ఆపవచ్చని చెప్పారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా కనీసం అరగంటసేపు వ్యాయామం చేయడం ద్వారా చాలా వరకు కట్టడి చేయవచ్చని పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వి. తారక్‌నాథ్ మాట్లాడుతూ సోఫాలు, కుర్చీల్లో ఎక్కువసేపు టీవీలు, సెల్‌ఫోన్‌లు చూస్తూ కూర్చుండి పోకుండా అటూ ఇటూ శరీరాన్ని కదలించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ స్ట్రోక్ బారిన పడకుండా చూసుకోవాలని వెల్లడించారు. డబ్బులు, బ్యాంక్ బ్యాలెన్స్‌ల కోసం పరుగులు పెట్టకుండా హెల్త్ కోసం కొంత సమయం కేటాయించాలని సూచించారు. గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి మాట్లాడుతూ ప్రతిరోజూ యాక్టివ్‌గా వ్యాయామం చేయడం ద్వారా స్ట్రోక్ ముప్పు నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బిందు నర్మద మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే వ్యాయామంపై పిల్లలకు ఆసక్తి పెంచాలని, అది వారికి వయస్సు పెరిగే కొలది ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ర్యాలీలో గుంటూరుకు చెందిన పలువురు న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు, ఇతర వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జట్ల ఎంపిక పోటీల షెడ్యూలు విడుదల

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లు ఎంపిక పోటీల షెడ్యూల్‌ను పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం ప్రకటించారు. ఇప్పటికే ప్రకటించిన అండర్–14 బాలబాలికల అథ్లెటిక్స్ జట్టు ఎంపిక పోటీలను సిరిపురం జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 28 నుంచి 29వ తేదికి మార్పు చేసినట్టు తెలిపారు. మిగిలిన అండర్–14, అండర్–17 బాల బాలికల క్రీడల ఎంపిక పోటీల షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి.

క్రీడలు	తేదీ	ప్రదేశం
టెన్నీకాయిట్, రోప్ స్కిప్పింగ్	29-10-2024	మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, నరసరావుపేట
రగ్బీ	30-10-2024	జెడ్పీ హైస్కూల్, నూతక్కి
నెట్ బాల్	30-10-2024	ఏఎంజీ హైస్కూల్ చిలకలూరిపేట
వాలీబాల్	01-11-2024	జడ్పీ హైస్కూల్ నూతక్కి
క్రికెట్	02-11-2024	ఎంఎస్‌కె ప్రసాద్ గ్రౌండ్స్, నంబూరు

డయేరియా మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


చిన్న వీరయ్య కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో డయేరియాతో మృత్యువాతపడిన కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నేతలు అండగా నిలిచారు. మృతుల కుటుంబాలకు గురజాల మాజీ శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి ఆర్థికసాయం ప్రకటించారు. డయేరియా లక్షణాలతో మృతిచెందిన బండారు చిన్న వీరయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, కౌన్సిలర్లు దేవళ్ల లక్ష్మీప్రసన్న, ఎంపీపీ కందుల జాను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మురుగుడు రఘు, కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌భాషా, బత్తుల బాలయ్య, వేముల తిరుపతయ్య, లింగయ్య పాల్గొన్నారు.

కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు


సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లో జెండాలు పాతిన కార్మికులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఉన్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు కోర్టు తీర్పుల ప్రకారం న్యాయంగా రావాల్సిన బకాయిలను యాజమాన్యం చెల్లించాలని, లేదా భూములు కార్మికులకు అప్పగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్. బాబూరావు డిమాండ్ చేశారు. తమకు రావాల్సిన బకాయిల కోసం ఆదివారం కార్మికులు ఫ్యాక్టరీ భూముల్లో జెండాలు పాతారు. వందలాది కార్మిక కుటుంబాలు యూనియన్ కార్యాలయం నుంచి భూముల్లోకి భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ 1993లో ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్‌కు గురైందని, దశాబ్దాలు గడిచినా ప్రభుత్వాలు కార్మికులకు న్యాయం చేయడం లేదని తెలిపారు. యాజమాన్యం కూడా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు 43 కోట్ల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చినా, యాజమాన్యం అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ లాకౌట్ గురి అయ్యేనాటికి 333 మంది కార్మికులు పనిచేస్తున్నారని, ఇప్పటి వరకు 178 మంది మరణించారని తెలిపారు. 30 ఏళ్లకు పైగా కార్మికులు చేస్తున్న పోరాటం కీలకమైన దశకు చేరుకుందని, సమస్య పరిష్కారం అయ్యేంత వరకు భూముల్లోనే ఇల్లు వేసుకుని ఉండాలని పిలుపునిచ్చారు. సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ఫ్యాక్టరీ కార్మికులు న్యాయమైన పోరాటానికి తమ మద్దతు పూర్తిగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కూరపాటి స్టీఫెన్, సీపీఐ (ఎంఎల్) నాయకులు స్వామి, ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, కూరపాటి కోటేశ్వరరావు, నాయకులు వై. నేతాజీ, దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టే కరుణాకరరావు, ఎం. శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల కాసయ్య, తుడిమెళ్ల వెంకటయ్య, ఐఏఎఫ్‌టీయూ నాయకులు చెన్నయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

సుద్దపల్లి(చేబ్రోలు): ఇద్దరు యువతులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సుద్దపల్లి గ్రామానికి చెందిన అల్లంశెట్టి నరసింహారావుకు చెందిన ఇద్దరు కుమార్తెలు బీటెక్, ఎంఎస్‌డీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. గ్రామానికే చెందిన మట్టుపల్లి వెంకటేశ్వర్లు, అల్లుడు చెరుకుపల్లి మండలం ఊసావారిపాలెంలో ఉంటున్నారు. కుమార్తెలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నమ్మించి ఇద్దరూ నరసింహారావు నుంచి రూ.20 లక్షలు తీసుకున్నారు. రెండేళ్లుగా కాలయాపన చేస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ డి.వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో రూ.51 లక్షలు మోసపోయిన వ్యాపారస్తుడు

వ్యాపారస్తుడు ఆన్‌లైన్‌లో రూ.51లక్షలు పోగొట్టుకున్న సంఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. యాప్‌లో పెట్టుబడి పెడితే లాభం వస్తుందని నారాకోడూరుకు చెందిన ఓ వ్యాపారస్తుడికి మెసేజ్ వచ్చింది. ఆయన ఆశ పడి యాప్ నిర్వాహకులు చెప్పిన అకౌంట్‌కు డబ్బులు పంపాడు. అలా విడతల వారీగా పంపిన అనంతరం ఫోన్ నంబరు బ్లాక్ కావడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ డి. వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

2న సకల మృతుల సంస్మరణ పండుగ



ఫిరంగిపురం: నవంబర్ 2న సకల మృతుల సంస్మరణ పండుగగా నిర్వహించనున్నట్లు బాలఏసు దేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో 30వ సామాన్య ఆదివారం సందర్భంగా దివ్య బలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ విచారణ గురువులు ప్రవీణ్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. నిత్య జీవితంలో కష్టాలు వచ్చినప్పుడు మానవుడు దేవుడిపై విశ్వాసం కోల్పోకూడదని తెలిపారు. దానిద్వారా ఆయన వెలుగు మనపై ప్రసరించి కష్టాలు తొలగిస్తాడని చెప్పారు. దేవుడి వాక్కు అద్దం లాంటిదని చెప్పారు. మన మొహాన్ని అద్దంలోచూసి సరిచేసుకుంటామో అదే విధంగా దేవుడి వాక్కుకు అనుగుణంగా నడుచుకోవాలని తెలిపారు. విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేస్తూ క్రీస్తు జయంతి మహోత్సవానికి సంసిద్ధతగా 7 మంగళవారోత్సవాలు, 5గురువార దివ్యోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి మంగళవారం , గురువారం సాయంత్రం 5:30 గంటలకు జపమాల, సమష్టి దివ్యబలిపూజ, తేరు ప్రదక్షణ ఉంటుందని చెప్పారు. నవంబర్ 2న సకల మృతుల సంస్మరణ(సమాధుల పండుగ) రోజు ఉదయం రెండు దివ్యబలి పూజలు నిర్వహిస్తామని చెప్పారు. సాయంత్రం సమాధుల స్థలం వద్ద గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య దివ్య బలి పూజలు నిర్వహించి ఆశీర్వదిస్తారని తెలిపారు. దీనిద్వారా ప్రతి కుటుంబం ఆత్మలకు శాంతి చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు రవీంద్ర, మఠ కన్య స్త్రీలు, గుడిపెద్దలు, మరియదళ సభ్యులు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ విజయనగరం జిల్లా


సైక్లింగ్ పోటీల్లో గెలుపొందిన విజయనగరం జట్టు

విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్–14, 17, 19 బాలురు, బాలికల సైక్లింగ్ టోర్నీలో విజయనగరం జిల్లా ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. మూడు విభాగాల్లో ఆ జిల్లా సైక్లిస్ట్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 34 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. 31 పాయింట్లతో గుంటూరు జిల్లా జట్టు రెండో స్థానంలో, ఆతిథ్య ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు 21 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఏపీఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ యూనిట్ పర్యవేక్షణలో రెండు రోజులపాటు నున్న జెడ్పీ హైస్కూల్ 16వ నంబరు జాతీయ రహదారిపై సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. మొత్తం 13 ఉమ్మడి జిల్లాల నుంచి 300 మంది సైక్లిస్ట్‌లు పోటీల్లో పాల్గొన్నారు. ఆయా విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్)నేషనల్స్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రెండు రోజులపాటు జరిగిన సైక్లింగ్ టోర్నీ ముగింపు కార్యక్రమాన్ని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ గేమ్స్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) సైక్లింగ్ కోచ్ వి.కనకారావు, ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేశారు. అంతకుముందు వ్యక్తిగత అంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి రిటైర్డ్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు (ఖాజీపేట) వేణుగోపాలరావు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు నరెడ్ల సత్యనారాయణరెడ్డి, గుంటక శివశేషిరెడ్డి పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.సుగుణరావు, సైక్లింగ్ టోర్నీ కార్య నిర్వాహక కార్యదర్శులు టి.శ్రీలత, టి.విజయవర్మ, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో దీవాలి విత్ మై భారత్

నెహ్రూనగర్: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, కేంద్ర మై భారత్ డిపార్ట్మెంట్ ఆదేశాల మేరకు మై భారత్ పోర్టల్ ప్రారంభమై సంవత్సరకాలం ముగుస్తున్న నేపథ్యంలో నెహ్రూ యువ కేంద్ర గుంటూరు ఆధ్వర్యంలో దీవాలి విత్ మై భారత్ అనే కార్యక్రమం ఈ నెల 29, 30వ తేదీల్లో నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్మయి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు నగరంలో ఈనెల 29న మార్కెట్ వద్ద స్వచ్ఛత కార్యక్రమం, 30న గవర్నమెంట్ హస్పిటల్ వద్ద వలంటరి సర్వీస్, స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత ఎన్డీవోస్ హాజరై జయప్రదం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు నెహ్రూ యువ కేంద్ర గుంటూరు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మహిళా ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలి


నూతన కార్యకవర్గ సభ్యులతో నాయకులు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి

బాపట్ల: మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రతి కార్యాలయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు సైకం శివకుమారి ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం ఏపీ జేఏసీ అమరావతి బాపట్ల జిల్లా చైర్మన్ సీహెచ్. సురేష్‌బాబు ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా మహిళా విభాగం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ పి. రజని అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో డివిజన్ కమిటీ ఏర్పాటు, మహిళా విభాగం బలోపేతం తదితర విషయాలపై చర్చించారు. సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు పనిచేసే చోట కనీస సౌకర్యాలు లేక అనేక అవస్థలు పడుతూ అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ఇప్పటికే సమస్యల్ని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి హజరా బేగం, మహిళా విభాగం జిల్లా సహాయ కార్యదర్శి రంజిత, మహిళా విభాగం నాయకురాలు ఉమామహేశ్వరి, సౌజన్య, నాగలక్ష్మి, ఏసమ్మ, శకుంతల ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

వేటపాలెం: విద్యార్థులు నిత్య జీవితంలో సైన్స్ నేర్చుకొని శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పేర్కొన్నారు. దేశాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా చెకుముకి సంబరాలు ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలోని అనేక మూఢనమ్మకాలకు అవాస్తవిక దృష్టికి దూరంగా ఉండాలన్నారు. వేదిక జిల్లా అధ్యక్షుడు యాజలి భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించేందుకు 36 ఏళ్లుగా చెకుముకి అనే పేరుతో సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యదర్శి రంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్షరాస్యత ఉద్యమంలోనూ మద్య నిషేధ ఉద్యమంలోనూ జనవిజ్ఞాన వేదిక ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. ప్రాథమిక పరీక్ష ఫలితాలు అనంతరం విజేత విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిచారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవరకొండ విజయలక్ష్మి, యు దక్షిణామూర్తి, డీ హరిబాబు, పీ రంగారావు, బిక్షాలుబాబు, కే శ్రీనివాసరావు, వీరప్రసాదు, జీ సూరిబాబు, కుర్రా శ్రీనివాసరావు, హేమంత్‌కుమార్, పాలేటి సురేష్, వెలుగొండారెడ్డి, కుమార్, జయరాజు, నూతలపాటి కోటేశ్వరారవు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

రెడ్లు ఆర్థికంగా బలోపేతం కావాలి

ఐక్యవేదిక కన్వీనర్ పట్నం సురేంద్రరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

బాపట్ల: రెడ్లు సామాజిక,ఆర్థికంగా బలోపేతం కావాలని అఖిల భారత రెడ్ల ఐక్య వేదిక కన్వీనర్ పట్నం సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సురేంద్రరెడ్డి మాట్లాడుతూ రెడ్లు సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. విద్య,ఉద్యోగాల కల్పనకు సహకారం అందించుకోవాలని తెలిపారు. ఐక్యవేదిక గౌరవ సలహాదారులు అన్నపురెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి వివాహ పరిచయవేదిక ద్వారా ఉచిత సేవలు పొందాలని సూచించారు. అఖిల భారత రెడ్ల ఐక్యవేదిక కోకన్వీనర్ దోరకచర్ల భరతరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్లందరూ ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని తెలిపారు. పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. అఖిలభారత రెడ్ల ఐక్యవేదిక మహిళా రాష్ట్ర నాయకురాలు సానం సుహాసినిరెడ్డి మాట్లాడుతూ రెడ్ల ఐకమత్యం ముందుగా కుటుంబ నేపథ్యం నుంచే ప్రారంభం కావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గంపాల వెంకటరెడ్డి, నాగార్జునరెడ్డి, వ్యాఖ్యాత సమ్మెట శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.